# నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 25 నవంబర్ 2024 | RANGAREDDY


## దొడ్డి కొమరయ్య త్యాగం వెలకట్టలేనిది..



**మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**జిల్లెలగూడ చందన చెరువు కట్టపై దొడ్డి కొమరయ్య విగ్రహావిష్కరణ**

బడంగ్‌పేట, నవంబర్ 24 : తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య అని, ఆయన త్యాగం వెలకట్టలేనిదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితాఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్టపై మీర్‌పేట కురుమ సంఘం అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆదివారం ఆమె ఆవిష్కరించి మాట్లాడుతూ..చందన చెరువు కట్టపై మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం మన అదృష్టమన్నారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన నరేశ్‌కుమార్ కుటుంబాన్ని ఆమె పరామర్శించి.. ఏఅండ్ఎం టూవీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున సమకూర్చిన రూ. 20 లక్షలను నరేశ్ కుమార్ కుటుంబానికి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కార్పొరేటర్లు పద్మా భాస్క ర్‌రెడ్డి, లావణ్య, మౌనిక, భూపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, నవీన్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, దీప్‌లాల్ చౌహాన్, కామేశ్‌రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరేందర్‌యాదవ్, సతీశ్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ కంటే..అధికంగా..



సిటీబ్యూరో: నగరంలోని పలు మెడికల్ షాపులపై డీసీఏ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న 'ఇట్వేజ్-200 క్యాప్సుల్స్'ను స్వాధీనం చేసుకున్నారు. డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...'ఇట్వేజ్-200 ఎంజీ క్యాప్సుల్స్'ను ఉత్తరాఖండ్‌లోని పంత్నాగర్‌లోని టీవోఎస్‌సీ ఇంటర్నేషనల్ ప్రై.లి. అనే ఫార్మా కంపెనీ తయారు చేస్తున్నది. వీటిని చెన్నైలోని స్కినోసియన్ అనే సంస్థ మార్కెటింగ్ చేస్తున్నది. అయితే ఇట్వేజ్-200 ఎంజీ 10 మాత్రల ధరను రూ.247.74గా నేషనల్ ఫార్మస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ నిర్ణయించింది. కానీ నిబంధనలకు విరుద్ధంగా స్కినోసియన్ మార్కెటింగ్ సంస్థ 10 మాత్రలను ఎమ్మార్పీ కంటే కంటే (రూ.51.25) అధికంగా రూ. 299కి విక్రయిస్తున్నది. మాత్రలపై ఇవే ధరలను ముద్రించింది. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు ఆదివారం అంబర్‌పేటలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇట్వేజ్-200 ఎంజీ క్యాప్సుల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

## అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

**బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య**

దౌల్తాబాద్, నవంబర్ 24 : లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కూర వెంకటయ్య ఆదివారం డిమాండ్ చేశారు. అధికారులకు ఎదురు తిరిగిన కేసులో పోలీసులు కొంతమందిని వదిలేసి ఇతరులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం సరికాదన్నారు. రైతుల నుంచి భూములను బలవంతం తీసుకోవడం తగదని.. సర్కార్ మొండిగా వ్యవహరిస్తే కొడంగల్ నియోజకవర్గంలో బీసీలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.



ఫోర్త్‌సిటీ రోడ్డు నిర్మాణానికి సర్వే చేస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది(ఫైల్)

# ఫోర్త్‌సిటీ బాధితులు..

**దశలవారీగా ఆందోళనలు తీవ్రతరం చేయాలని నిర్ణయం**

**ఆదివారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించిన బాధితులు**

**సమాచారం లేకుండానే తమ భూముల్లో సర్వే చేస్తున్నారు**

**భూములు తీసుకుంటే రోడ్డునపడుతాం**

**నేడు ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి గోడు వినిపించాలని నిర్ణయం**

# ప్రత్యక్ష పోరుకు సిద్ధం

*ఫోర్త్‌సిటీ రోడ్డు నిర్మాణ బాధితులు ప్రత్యక్ష పోరుకు సిద్ధమయ్యారు. దశలవారీగా ఆందోళనలను తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. తాము తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్న భూ ములను ప్రభుత్వం ఫోర్త్‌సిటీ రహదారి నిర్మాణానికి తీసుకుంటే రోడ్డున పడుతా మని కొంగరకలాన్, రావిర్యాల, పంజాగూడ, అగర్మియాగూడ, లేమూర్, మీర్‌ఖాన్‌పేట, తుర్కగూడ తదితర గ్రామాలకు చెందిన బాధిత రైతులు ఆదివారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరుగనున్న ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తమ గోడును వినిపించా లని నిర్ణయించుకున్నారు.*

*- రంగారెడ్డి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)*

### పోలీసుల నిర్బంధంలో సర్వే

ఫోర్త్‌సిటీ సర్వే పనులను రైతులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. తమ భూముల్లో ఎలాంటి సర్వేలు చేపట్టొద్దని అధికారులను హెచ్చరిస్తున్నారు. అయినా అధికారులు పోలీసుల నిర్బంధంలో సర్వేను చేపడుతున్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ భూముల్లో సర్వే చేయడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారులు తమ వినతులను పట్టించుకోకపోవడంతో బాధితులంతా సంఘటితమై ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరుకు సిద్ధం కావాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా ఫ్యూచర్‌సిటీ ఏర్పాటుతో ఎగ్జిట్ నం-13 నుంచి కొంగరకలాన్, రావిర్యాల, పంజాగూడ గ్రామాల్లో భూముల ధరలు ఎకరానికి రూ. కోట్లలో పలుకుతున్నాయి. రూ. కోట్లు పలికే భూముల నుంచి మూడు వందల మీటర్ల రోడ్డు ఏర్పా టు చేస్తే.. ఈ మూడు గ్రామాల్లోని సుమారు రెండు వందల మంది రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా కొంగరకలాన్ కలెక్టరేట్ నుంచి పంజాగూడ వరకు రోడ్డుకిరువైపులా సన్న, చిన్న కారు రైతులే అధికంగా ఉన్నారు. వారికి ఎకరం, రెండెకరాల భూములు మాత్రమే ఉన్నాయి. తమ భూముల నుంచి రోడ్డు ఏర్పాటైతే.. తమకు ఉపాధి ఉండదని.. ప్రభుత్వం స్పందించి రెండు వందల మీటర్ల వరకు రోడ్డును నిర్మిస్తే బాగుంటుందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

### దశల వారీగా ఆందోళనలు..

ఫ్యూచర్‌సిటీ రోడ్డు బాధితులు దశలవారీగా ఆందోళనలను తీవ్ర తరం చేయాలని నిర్ణయించారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి ఆ తర్వాత ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, సీఎంకు కూడా అర్జీని అందించాలని తమ గోడు చెప్పుకోవాలని భావిస్తున్నారు. సమాచారం ఇవ్వకుండా తమ భూములు సర్వే చేయడమే కాకుండా అడిగేందుకు వెళ్తే అడ్డుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

### బాధిత రైతులకు అండగా ఉంటాం..



ఫ్యూచర్‌సిటీ రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోనున్న బాధితులకు న్యాయం జరి గే వరకు అండగా ఉంటాం. రోడ్డు ఏర్పాటుతో ఎంతోమంది సన్న, చిన్నకారు రైతు లు భూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. రైతుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడం సమంజసం కాదు. రైతులకు తెలియకుండా, వారికి సమాచారం లేకుండా వారి భూముల్లో సర్వే చేయొద్దు.

-కృపాకర్



ఫార్మా బాధిత గ్రామాల్లో పోలీసుల బందోబస్తు (ఫైల్)



# అత్తెసరు..

**గత సర్కార్ ఇచ్చిన దానిలో సగంకన్నా తక్కువ చేప పిల్లల పంపిణీ**

**60,000 చేప పిల్లలను వదిలితే తమకు ఉపాధి ఎలా..?**

**పలువురు మత్స్యకారుల నిట్టూర్పు**

**కేసీఆర్ హయాంలో లక్షా40 వేల చేపలను విడిచారని వెల్లడి**

**మాసబ్ చెరువులో ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్‌తో కలిసి చేప పిల్లలను వదిలిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి**

తుర్కయాంజాల్, నవంబర్ 24 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చెరువుల్లో చేప పిల్లలను అత్తెసరుగా వదులుతున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి ఎంతో కృషి చేసింది. మత్స్యకారుల ఉపాధి కోసం ప్రతి ఏడాది తుర్కయాంజాల్ మాసబ్ చెరువులో లక్షా40 వేల చేపలను ఉచితంగా వదిలింది. అంతేకాకుండా గంగపుత్రులకు వలలు, మోపెడ్ వాహనాలను సబ్సిడీపై అందించి ఆదుకున్నది. కానీ, రేవంత్ సర్కార్ తమకు ఈ ఏడాది కేవలం 60,000 చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేస్తామని చెబుతున్నదని.. అది కూడా శేరిగూడకు వచ్చి వాటిని తీసుకెళ్లాలని అధికారులు పేర్కొంటున్నారని పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో చెరువుల వద్దకే వచ్చి చేప పిల్లలను వదిలిన విషయాన్ని గుర్తు చేసుకుంటు న్నారు. కాగా ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మాసబ్ చెరువులో ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేప పిల్లలను చెరువులో వదులగా.. పలువురు మత్స్యకారులు 60,000 చేప పిల్లలను చెరువులో వదిలితే తమకు ఉపాధి ఎలా అని నిట్టూర్చారు.

# నాలాలపై హైడ్రా నజర్..!

**నాలాల విస్తరణ, సమాంతర డ్రైయిన్ల నిర్మాణంపై నిపుణులతో చర్చ**

**బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులనే కొనసాగించే యోచన**

**ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్న కమిషనర్ రంగనాథ్**

సిటీబ్యూరో, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): ముంపు ముప్పు నేపథ్యంలో హైదరాబాద్‌లో నాలాలపై హైడ్రా దృష్టిపెట్టింది. జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ లోపల వరకు నాలాల విస్తరణ, సమాంతర డ్రైయిన్ నిర్మాణం అంశాలపై రిటైర్డ్ ఇంజినీర్లతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్చించారు. నాలాల ఆక్రమణల తొలగింపు వల్ల స్థానికులతో వివాదాలు, పునరావాసం వంటి ఇతర అంశాలకు పెద్ద ఎత్తున నిధులు అవసరమున్న నేపథ్యంలో నాలాల విషయంలో హైడ్రా ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నది. నాలాలకు సమాంతరంగా డ్రైయిన్ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ పథకం కింద చేపట్టింది. ఇటీవల రాంనగర్‌లో నాలాలపై ఆక్రమణల తొలగింపు తర్వాత ఎదురైన అనుభవాల కారణంగా గత ప్రభుత్వ ప్రణాళికనే అమలు చేస్తే బాగుంటుందని హైడ్రా భావిస్తున్నది. మూడురోజుల కిందట హైడ్రా కార్యాలయంలో జరిగిన సమావేశంలో చెరువుల పునరుద్ధరణతో పాటు నాలాలపై కూడా ఆసక్తికర చర్చ జరిగింది. ఇందులో నాలాలపై ఆక్రమణల తొలగింపు, పునరావాసం, పునరుద్ధరణ వంటి వాటి కోసం రూ.లక్ష కోట్లు అవసరమవుతాయంటూ రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పారు. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలో ఎస్ఎన్‌డీపీ పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రస్తావించారు.

### సొంత పార్టీ నేతల నుంచే..

నాలాల పునరుద్ధరణలో భాగంగా అవసరమైన చోట వాటిని తొలగించే పనిని హైడ్రాకు అప్పగించారు. రాంనగర్‌లో జరిగిన ఆక్రమణల తొలగింపు తర్వాత నాలాల విషయంలో స్థానికులు ప్రధానంగా సొంత పార్టీ నేతల నుంచే ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిళ్లు రావడంతో దీంతో హైడ్రా నాలాలపై ఆక్రమణల తొలగింపులో వెనక్కి తగ్గింది. మరి ముంపు సమస్యను పరిష్కరించడం ఎలా అన్నదానిపై ప్రభుత్వం, పురపాలక శాఖ, హైడ్రా బృందంతో సమీక్ష నిర్వహించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దన్న ఆలోచనతో ప్రస్తుతం ఉన్న నాలాలకు సమాంతర డ్రెయిన్లను నిర్మించడానికి ఎస్ఎన్‌డీపీ పథకం కింద ప్రణాళికలు రూపొందించింది. కొన్నిచోట్ల పనులు కూడా జరిగాయి. మొదటిదశలో జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 737 కోట్ల నిధులతో 35 పనులు చేపడితే 55 శాతం పూర్తయినట్లు తెలుస్తున్నది. గ్రేటర్ వెలుపల 248 కోట్లతో 21 పనులు చేపడితే 40 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పనుల కొనసాగింపు లేకపోగా.. హైడ్రా పేరుతో కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. కానీ ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో తిరిగి బీఆర్ఎస్ ప్రణాళికలనే అమలు చేసి పనులు చేయడానికి నిపుణుల సలహాతో ముందుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో పురపాలక శాఖ హైడ్రా సహకారం తీసుకుంటున్నారని, ఈ క్రమంలో తాము నిపుణుల సలహాలు తీసుకుని నివేదిక తయారు చేస్తున్నామని హైడ్రా అధికారులు పేర్కొన్నారు.



### ఆక్రమణల తొలగింపు కష్టమే..

జీహెచ్ఎంసీ పరిధిలో 370 కిలోమీటర్ల మేర మేజర్ నాలాలు ప్రవహిస్తున్నాయి.1250 కిలోమీటర్ల మేర వరద నీటి కాల్వలు న్నాయి. వరద, మురుగు నీటిని మోసుకెళ్తూ మూసీలో కలుస్తాయి. వీటి ప్రవాహవ్యవస్థ సామర్థ్యం కేవలం 2సెంమీలు మాత్రమే. కొన్నాళ్లుగా తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో వర్షపాతం నమోదవడంతో రహదారులన్నీ జలమయమవుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇందుకు నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కారణంగా తెలుస్తున్నది. గతంలో జీహెచ్ఎంసీ చేపట్టిన సర్వేలో నాలాలపై 12వేలకు పైగా ఆక్రమణలున్నట్లు గుర్తించారు. ఇందులో 35 శాతం మేర నివాసేతర నిర్మాణాలే ఉన్నట్లు గుర్తించారు. వాటి వల్ల కొన్నిచోట్ల 50 అడుగుల వెడల్పు ఉండాల్సిన నాలాలు 10 అడుగుల వెడల్పునకు చేరుకున్నాయి. ఫలితంగా చాలా ప్రాంతాలు జల దిగ్బంధంలో ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.

### ఇంజినీర్ల సహకారం..!

ఈ నేపథ్యంలో హైడ్రా ఇటీవల వర్షాకాలంలో నాలాలపై సర్వే కోసం ఇంజినీరింగ్ విద్యార్థుల సహకారాన్ని తీసుకున్నది. రాంనగర్ మణెమ్మకాలనీలో నాలాపై నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని నేలమట్టం చేశారు. అదే తరహాలో మిగిలిన నాలాలపై ఆక్రమణలు కూడా తొలగించాలనుకున్నా.. అది ఆచరణలో చాలా కష్టమని తేలింది. నాలాల పునరుద్ధరణకోసం జేఎన్‌టీయూ, బిట్స్‌పిలానీలోని ఇంజినీరింగ్ విద్యార్థుల సహకారంతో హైడ్రా సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ఆక్రమణలకు సంబంధించిన అంశాలతో పాటు ప్రధానంగా ఎక్కడెక్కడ మెయిన్ పాయింట్స్‌లో సమస్య ఉందో కూడా నివేదిక రూపొందించారు. అయితే గతంలో జీహెచ్ఎంసీ చేసిన సర్వేతో పాటు ఇంజినీరింగ్ విద్యార్థుల సర్వే రెండింటిని కూర్పు చేసి సమస్య పరిష్కారం దిశగా అడుగులేసే యోచనలో హైడ్రా ఉంది. ఇప్పటికే ఈ నివేదికలు ఉన్న కారణంగా హైడ్రా కార్యాలయంలో రిటైర్డ్ ఇంజినీర్లతో జరిగిన సమావేశంలో నాలాలపై చర్చించారు. గ్రేటర్ లోపల నాలాల పరిస్థితిపై అధ్యయనం చేసి నాలాల నిర్మాణంపై అవగాహన ఉన్న కిషన్ వంటి ఇంజినీర్లతో ఒక కమిటీ వేసి వారి సలహాలతో ముందుకెళ్లాలని నిర్ణయించుకుంటున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి సర్వే రిపోర్ట్‌తో పాటు హైడ్రా సమావేశ నివేదికను అందించి తుది కార్యాచరణ రూపొందిస్తారని తెలిసింది.

# సండే.. సందడి

**కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి**

**సరదాగా బోటింగ్ చేసి.. సెల్ఫీలు దిగి**

**కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆహ్లాదకరమైన ప్రాజెక్టు అందాలను తిలకించి..సరదాగా బోటింగ్ చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి నీటిలో సెల్ఫీలు దిగారు. సిబ్బంది పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. బోటింగ్ చేసే వారికి రక్షణగా దుస్తులను ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే తెలిసేలా ప్రాజెక్టు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.**

**- ధారూరు, నవంబర్ 24**



కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు